క్లుప్తంగా

బోర్డులో మండలం పేరు మార్పు



కార్యాలయ బోర్డులో మండలం పేరు మార్చిన దృశ్యం

దెందులూరు: ఎట్టకేలకు పశుసంవర్ధకశాఖాధికారులు గోపన్నపాలెంలోని అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన కార్యాలయం బోర్డులో తప్పుగా రాసిన మండలం పేరును మార్చారు. గోపన్నపాలెంలో సీమపందుల పెంపకం కేంద్రం, అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం సూచించే బోర్డులో గోపన్నపాలెం పెదవేగి మండలం అని రాశారు. 'సాక్షిలో' ఈ అంశంపై ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు పెదవేగి స్థానంలో దెందులూరు అని మార్పు చేశారు.

దెందులూరులో నగర సంకీర్తన

దెందులూరు: దెందులూరులో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం దశమి తెల్లవారుజామున భూ, నీళా సమేత చెన్నకేశవరస్వామి (విష్ణు ఆలయం) ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటలకు నగర సంకీర్తన నిర్వహించారు. మహిళలు, పురుషులు సంప్రదాయ దుస్తులు ధరించి తెల్లవారుజామున 4 గంటలకు విష్ణు ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారి రథంతో పాటు గ్రామంలోని పురవీధుల్లో నగర సంకీర్తన చేశారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో అన్నసమారాధన



ప్రత్యేక అలంకరణలో భక్తాంజనేయస్వామి

పెదవేగి : నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం భక్తాంజనేయునికి భక్తులు అఖండ దీపారాధనతో పాటు విశేష పూజలు చేసారు. మండలంలోని వేగివాడలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ వ్రత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జనవరి 1నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాలను కమిటీ సభ్యులు వైభంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

గోపినాథపట్నం ఆంజనేయ స్వామికి లక్ష చామంతి పూజ



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ

ఉంగుటూరు: గోపినాథపట్నం ఆంజనేయ స్వామి ఆలయంలో ముక్కోటి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం లక్ష గులాబీ, లక్ష చామంతి, లక్ష తులసీ దళాలతో పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొని సతీసమేతంగా పూజలు నిర్వహించారు. కొట్టు సత్యనారాయణ కుటుంబానికి ఆరాధ్యు దేవుడైన ఆంజనేయస్వామి ఆలయానికి ఆయనే చైర్మన్. కోడిగూడెం భక్త సమాజం సభ్యులు హనుమాన్‌ఛాలీసా పారాయణం చేశారు. వైభవంగా నిర్వహిస్తున్న పూజల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొంటున్నారు.

చర్చి నిర్మాణానికి రూ.30 వేల వితరణ

పెదవేగి : దేవుని ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని వంగూరు ఫాదర్ చిన్ను అన్నారు. పెదవేగి మండలం వంగూరు పంచాయతీ గొగినేపల్లిలోని నూతనంగా నిర్మిస్తున్న క్రైస్తవ దేవాలయానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలతో మండల నాయకులు కేశన సతీష్ రూ.30 వేలు విరాళం చెక్కును అందించారు. చర్చి నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందించిన సతీష్‌ను ఫాదర్ అభినందించి, సత్కరించారు.

భోగాపురం పేకాట స్థావరంపై దాడి

భీమడోలు: గుండుగొలను పంచాయతీ శివారు భోగాపురంలో పేకాట స్థావరంపై ఆదివారం భీమడోలు పోలీసులు ఆకస్మిక దాడి చేసారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ నేతృత్వంలో పోలీసుల బృందం దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,200 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం : స్థానిక నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించారు.

పెరిగిన పింఛన్.. ఆనందంలో అవ్వాతాతలు

- రూ. 2,500 నుంచి రూ 2,750 పెన్షన్ పెంపు
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందించిన వలంటీర్లు, నాయకులు
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- దెందులూరు నియోజకవర్గంలో 37,197 మందికి పెన్షన్ అందజేత



మంచంపైఉన్న ఓ వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



పోలసానిపల్లిలో పింఛన్ నగదును అందిస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా తదితరులు



భీమడోలులో ఇంటింటికీ వెళ్లి పెంచిన ఫింఛన్ నగదును అందజేస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచులు ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్



అలుగులగూడెంలో బొళ్ళే వెంకమ్మకు ఉదయం 5.30 గంటలకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ నాగేంద్ర

పెదవేగి : జగనన్న నూతన సంవత్సర కానుకగా రూ.2,500 నుంచి రూ.2,750 పెంచిన పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. నూతన సంవత్సరం దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో ఆదివారం పెన్షన్లు పంపిణీ చేశారు. ఉదయాన్నే ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పెదవేగి మండలం కొండలరావు పాలెంలో పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి పెరిగిన రూ 2,750 పెన్షన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న నూతన సంవత్సర కానుకగా రూ. 2,500 నుంచి రూ.2,750 పెంచిన పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేసి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అన్నారు. పెన్షన్ తీసుకున్న లబ్ధిదారులు, సంతోషం వ్యక్తంచేస్తూ, నిండు మనసుతో సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని దీవించారు. ఈ జనవరి 1 నుంచి దెందులూరు నియోజకవర్గంలో 1,199 మంది లబ్ధిదారులకు కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని, అందులో దెందులూరు మండలంలో 295 మందికి, ఏలూరు రూరల్ మండలంలో 215 మందికి, పెదపాడు మండలంలో 291 మందికి, పెదవేగి మండలంలో 398మందికి పెన్షన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం దెందులూరు నియోజకవర్గంలో అమలులో ఉన్న 35,998 మందికి అదనంగా మరో 1,199మంది మొత్తంగా 37,197 మంది లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, స్థానిక సర్పంచ్ పాలడుగు సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు దేవళ్ళరాజు రాధిక, సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పెదబాబు. స్థానిక నాయకులు దేవళ్ళరాజు రాజశేఖర్, ముళ్ళపూడి వీర్రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక అందజేత

భీమడోలు: వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో పెరిగిన పింఛను సొమ్మును లబ్ధిదారులకు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రజాప్రతినిధులు పంపిణీ చేసారు. పెరిగిన నగదు రూ.2,750 లబ్ధిదారులకు అందించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 8,934 మంది వృద్ధులు, మహిళలు, వితంతులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, మత్స్యకార పింఛన్‌దారులు న్నారు. వారికి ప్రభుత్వం రూ.2.49కోట్లు విడుదల చేయగా తొలిరోజు 6,827 మందికి రూ.1.90కోట్లు అందించారు. 76.47 శాతం పంపిణీ పూర్తి చేశారు. వారందరికీ నగదును గడపగడపకూ వెళ్లి అందించారు. భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు అందజేసారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా చేతుల మీదుగా పింఛన్ల నగదును అందించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల దీవెనలు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

నియోజకవర్గంలో 1,199 మందికి కొత్తపెన్షన్లు మంజూరు

దెందులూరు: రానున్న కాలమంతా అభివృద్ధి, సంక్షేమంతో కూడిన నవశకమేనని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామ శివారు ప్రాంతాలు మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని సంతరించుకుంటాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో 1,199 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 35,998 పెన్షన్ల నగదు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం 1,199తో కలిపి 37,197 మంది లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్నామన్నారు. దెందులూరు మండలంలో 295 మందికి, ఏలూరు రూరల్ మండలంలో 215 మందికి, పెదపాడు మండలంలో 291 మందికి, పెదవేగిమండలంలో 395మందికి కొత్త పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 1,199 మందికి పెన్షన్ మంజరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గం ప్రజల తరపున ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృతజ్ఞతలుతెలిపారు.

తెల్లవారుజామునే ఉత్సాహంగా పెన్షన్ నగదు పంపిణీ

మండలంలో గ్రామగ్రామాన ఆదివారం తెల్లవారుజామునే పెన్షన్ల నగదు పంపిణీ ఉత్సాహంగా వలంటీర్లు ఇంటింటా పంపిణీ చేశారు. రూ.250 పెంచిన నగదుతో కలిపి రూ.2750 నగదును లబ్ధిదారుల ఇళ్ కు వలంటీర్లువెళ్లి అందజేశారు. గ్రామగ్రామాన పెన్ష న్ లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధే ధ్యేయంగా కృషి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేయిస్తున్న దెందులూరు మండల నాయకులు

పెదవేగి : నూతన సంవత్సరంలో అభివృద్ధే ధ్యేయంగా సంకల్పసిద్ధితో కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, అబ్బయ్యచౌదరిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా రాట్నాలకుంటలో రాట్నాలమ్మతల్లి దేవస్థానంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కొఠారు రామచంద్రరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వారు పుస్తకాలు, పెన్నులు, పండ్లు అందించి, స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పల్లెల్లో నూతన సంవత్సర సందడి



భీమడోలులో రూపక దేవాలయం పూజలు చేస్తున్న భక్తులు



చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న కవ్వగుంట విచారణ గురువు

భీమడోలు: మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లోని స్వామి వారిని తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శించుకున్నారు. భీమడోలు అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. భీమడోలు జంక్షన్‌లోని ద్వారకాతిరుమల దేవస్థానానికి చెందిన రూపక దేవాలయంలో బృందావనం సాయిరామ్ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. గుండుగొలనులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి మాలధారులు ఇరుముడులు ధరించి చిన్నతిరుపతికి వెళ్లారు.

వాడవాడలా సంబరాలు

పెదవేగి : మండలంలోని గ్రామాల్లోని ప్రతి ఇంటి ముందు రంగురంగుల రంగవల్లులు దర్శనమిచ్చాయి. నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం రాత్రి గడచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువతీ, యువకులు సందడిచేశారు. నడిపల్లి ఆర్‌సీఎం చర్చిలో స్థానిక విచారణ గురువు రాజు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. మాజీ ఉపసర్పంచ్ గొట్టేటి స్టాలిన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. విజయరాయిలో కథోళిక సంఘం, బిలీవర్స్ ఈస్టన్ చర్చ్ ఆధ్వర్యంలో నూతనసంవత్సర ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.

దెందులూరు: మండలంలోని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జోగన్నపాలెంలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతంగంగరాజు నివాసంలో నూతనసంవత్సర వేడుకలు ఘనంగాజరిగాయి. వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు కామిరెడ్డి నాని, నిట్టాలీలానవకాంతం గంగరాజును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేకులు కట్ చేశారు.

ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

పెదపాడు: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, వడ్డి కార్పొరేషన్ డైరక్టరు ఘంటసాల ప్రభాకరరావు, ఎస్ కొత్తపల్లి సర్పంచ్ చేపేని రంగారావు, మండల వ్యవసాయ సలహామండలి సభ్యుడు ముంగర రమేష్, స్థానిక ఉపసర్పంచ్ పెంకి శ్రీనివాసరావు, నాయకులు కొత్తూరు విమలారావు, సాధం కిశోర్, గుణుపూరు మహేష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం వృద్ధి



నీతి కథలను వివరిస్తున్న లయన్స్ డైమండ్స్ క్లబ్ టీవీ ఉమామహేశ్వరరావు, టీచర్ మండే సుధాకర్

భీమడోలు: పుస్తక పఠనంపై జిజ్ఞాస కలిగిన ప్రతి ఒక్కరికీ విజ్ఞానం వృద్ధి చెంది ఉన్నత స్థితికి చేరుకుంటారని భీమడోలు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, భీమడోలు లయన్స్ డైమండ్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు పుస్తక పఠనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర సంబరాలను గ్రంథాలయ పాఠకులు, బాలబాలికల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో పెద్దలు పీవీ రాఘవులు, ధర్మరాజు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



శ్రీవారి క్షేత్రంలో తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త సంవత్సరం అంతా శుభదాయకంగా ఉండాలన్న ఉద్దేశంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దర్శనం క్యూలైన్లు యాత్రికులతో కిక్కిరిసాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో నిండుగా కనిపించాయి. అలాగే పార్కింగ్ ప్రదేశం భక్తుల వాహనాలతో నిండిపోయింది. వేలాది మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. నిత్యాన్నదాన భవనంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు స్వయంగా పరిశీలించారు.

ప్రతి ఇంటి ముంగిట శ్రీవారికి నీరాజనాలు

నూతన సంవత్సరం తొలిరోజున తమ ఇంటి ముంగిటకు వచ్చిన శ్రీవారికి భక్తులు పూజాధికాలు జరిపి, నీరాజనాలు సమర్పించారు. చినవెంకన్న దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ఈ ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో శ్రీవారిని, అమ్మవార్లను ఉంచి అర్చకులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

చర్చిల్లో ప్రార్థనలు



భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో దైవ సందేశాన్ని అందిస్తున్న విచారణ కర్త నెల్సన్

భీమడోలు: ప్రతి కుటుంబం కొత్త ఆలోచనలతో జీవించాలని భీమడోలు విచారణ కర్త ఫాదర్ నెల్సన్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, కోడూరుపాడు, కొల్లేరు గ్రామాల్లోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, బైబిల్ మిషన్, రక్షణ సైన్యం, పెంతోకోస్తు, ఏసుక్రీస్తు ప్రార్థన మందిరాల్లో శనివారం రాత్రి నుంచి నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో విచారణ కర్త నెల్సన్, సుపీరియల్ జోబి కేక్ కట్ చేసారు. విశ్వాసులంతా ప్రార్థనలు చేసారు. తొలుత ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫాదర్ జోషి, విన్సెంట్ స్కూలు ప్రిన్సిపల్ ఫాదర్ రాజు, విన్సెంట్ డీపాల్ సొసైటీ సభ్యులు, జీసస్ యూత్, పెద్దలు, మత విశ్వాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన నృత్యోత్సవం



శ్రీవారి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో నాట్యకారిణుల ప్రదర్శన

ద్వారకాతిరుమల : శ్రీవారి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన నృత్యోత్సవం చూపరులను అలరించింది. దేవదాయ శాఖ – ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ నృత్యోత్సవాన్ని ముందుగా ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్యకారిణులు భరతనాట్య ప్రదర్శనలు చేశారు.

విద్యుదాఘాతానికి తాటాకిల్లు దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి ఆదివారం తెల్లవారుజామున ఒక తాటాకిల్లు దగ్ధమైంది. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోడ బాలరాజు కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఇంటికి నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాదాన్ని గుర్తించిన బాలరాజు, కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి, ప్రాణాలను దక్కించుకున్నారు. సమాచారం అందుకున్న భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లోని సామాగ్రితో పాటు పొలం దస్తావేజులు, 3 కాసుల బంగారం, రూ.3 లక్షల నగదు కాలిబూడిదైనట్టు బాధితుడు బాలరాజు తెలిపాడు.

కొల్లేరు గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం ఏలూరు మండలం కొల్లేరు గ్రామాల పెద్దలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు, గుడివాకలంక ఉపసర్పంచ్ ఘంటసాల రుక్మనంద మహరాజ్ తదితరులు కొల్లేరు గ్రామాలకు ప్రభుత్వ కళాశాల మంజూరు అయ్యేలా కృషి చేయాలని కోరారు. దీనిపై ఎంపీపీ స్పందించి మాట్లాడుతూ మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కృషి చేస్తున్నారన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
Office mail : tpgadvt@gmail.com